క్లుప్తంగా

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

రంగారెడ్డినగర్: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని.. ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఏర్పడబోయేది తమ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రతినిధి, మాజీ ఎంపీపీ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్, గాజులరామారం డివిజన్లకు చెందిన దీపక్, రాకేష్, ఇమ్రాన్, మొబిల్, మనోహర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే యువతకు ఉద్యోగవకాశాలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సబ్సిడీపై రుణాలు ఇస్తామన్నారు. గాజులరామారం డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ షఫీ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధే తన ధ్యేయమని స్థానిక కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం మైసమ్మనగర్‌లో కోటి ముప్పై లక్షల రూపాయలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో దాదాపుగా అన్ని రోడ్లు పూర్తి అయ్యాయని అన్నారు. మిగిలిన అంతర్గత రోడ్లు కూడా వీలైనంత తొందరగా పూర్తి చేస్తానని తెలిపారు.

'అక్బర్ జమాల్, సుభాష్ శర్మ కోర్టులో లొంగిపోవాలి'

కుత్బుల్లాపూర్: నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయి తప్పించుకు తిరుగుతున్న నగరంలోని సైదాబాద్‌కు చెందిన అక్బర్ జమాల్, ట్రూప్ బజార్‌కు చెందిన సుభాష్ శర్మలు వెంటనే ఆగస్టు 1వ తేదీన మేడ్చల్ కోర్టులో లొంగిపోవాలని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ ఓ ప్రకటనలో హెచ్చరికలు జారీ చేశారు. మేడ్చల్ కోర్టు నుంచి వారెంట్ జారీ అయిన నేపథ్యంలో నిందితులు లొంగిపోని పక్షంలో ఐసీపీ సెక్షన్ 83 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారి ఆస్తులను జప్తు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు శుభాకాంక్షలు




కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రాస్‌ను సోమవారం కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీనివాస్‌గౌడ్ గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద పీట వేయాలని కోరారు.

పద్మశాలి ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

జగద్గిరిగుట్ట: ఆగస్టు 13న కోరుట్లలలో జరిగే పద్మశాలి ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామా శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యాధికార సాధన కోసం ఈ సభను జరుపుతున్నామని, పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని రామా శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షులు బేతి గోపాల్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువులో సోమవారం ఓ మహిళ మృతదేహం తేలడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. సదరు మహిళ వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిందా.. లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు.. నష్టపరిహారం చెల్లించాలి

రాష్ట్ర బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్‌లో జరిగిన అభివృద్ధిపై ప్రశ్నిస్తే కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అవాకులు, చవాకులు పేలుతున్నారని.. దమ్ముంటే చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ సవాల్ విసిరారు. కొంపల్లి ఉమామహేశ్వర కాలనీలో వరదలతో నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

– ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఉమామహేశ్వర కాలనీ ప్రజలు వరద ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. శాశ్వత పరిష్కారం చూపడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని మండిపడ్డారు. కొంపల్లి మున్సిపల్‌లో జరిగిన అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చర్చకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన వారిని ప్రజలు ఛీదరించుకుంటున్నారని అన్నారు. ఉమామహేశ్వర కాలనీలో ప్రతి బాధిత కుటుంబానికి రూ.50 వేల నష్ట పరిహారం చెల్లించాలన్నారు.

◆ అదే విధంగా అపర్ణ పామ్ గ్రూప్‌లో మొగిల్ల చెరువు వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. కాలనీలో రోడ్లు,విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కౌన్సిలర్ రాజిరెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, శివాజీ రాజు, శంకర్ నాయక్, సరితారావు, వెంకటేష్, ఉమామహేశ్వర, అపర్ణ పామ్ గ్రూప్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ప్యానల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న చుక్క రాములు

చింతల్: కార్మికుల హక్కులు నెరవేరాలంటే సీఐటీయూ ప్యానల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మిక పక్ష నేత చుక్క రాములు అన్నారు. గాంధీనగర్‌లోని వైఎంఎస్ ఫంక్షన్‌హాలులో సోమవారం జరిగిన ఎంటీఏఆర్ కార్మికుల గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీఐటీయూ ప్యానల్‌పై అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న చుక్క రాములు మాట్లాడారు. ఎంటీఏఆర్ కార్మికులు ఇన్‌స్టాల్‌మెంట్ వేతన ఒప్పందం చేయడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ ఎన్నో వందల కంపెనీలలో వన్‌టైం అగ్రిమెంట్లను చేశామే తప్ప ఇన్‌స్టాల్మెంట్ అగ్రిమెంట్లు ఎక్కడ చేయలేదన్నారు.

◆ కార్మిక సంఘాల ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు పోటీ చేయడం వల్ల కార్మిక వర్గానికి ఎలాంటి ఉపయోగం లేదని.. కార్మికులకు వెన్నంటూ ఉండే సీఐటీయూని గెలిపించాలని కోరారు. ఏంటీఏఆర్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల జీవితాలలో వెలుగును పంచేందుకు సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. గతంలో కార్మికులకు రూ.28 వేల నుంచి రూ.40వేల వరకు బోనస్ ఇప్పించిన చరిత్ర సీఐటీయూకు ఉందని తెలిపారు. రాజకీయ నాయకుల మాటలు విని కార్మికుల మోసపోవద్దన్నారు.

◆ ఈ కార్యక్రమంలో ఎంటీఏఆర్ యూనియన్ నుంచి పోటీ చేస్తున్న ప్రధాన కార్యదర్శి జె.నాగరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శంకర్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కీలుకాని లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్, మహేంద్ర, సాండ్విక్, కిర్బీ తదితర కంపెనీల కార్యదర్శిలు, ఎంటీఏఆర్ కార్మికులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటా



వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుచిత్ర రోడ్డులో చిరు వ్యాపారాలు చేసుకునే 262 మందికి సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. జీవన కృషి స్ట్రీట్ వెండర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ మహేష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ కృపాలాని, జాయింట్ సెక్రటరీలు రవి వర్మ, సూర్యనారాయణ, శివ, ట్రెజరర్ రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం కోసం పోరాడుదాం

సాక్షి, మేడ్చల్ జిల్లా: సెప్టెంబర్ 2004 నుంచి నియమించబడిన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజేందర్ మార్గదర్శకాలతో మేడ్చల్ జిల్లాలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆఫీస్‌బేరర్లు, వివిధ యూనిట్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వేతనం రూ. 15 వేల నుంచి రూ.28,719 పెంచాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు నెల వేతనం రూ.28,719 పెంచి, మేడ్చల్ జిల్లాలోనే పెంచకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ఔట్ సోర్సింగ్ కార్యదర్శులతో భర్తీ చేయాలని కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 95 సర్వే నంబర్ ప్రాంతంలో డ్రైనేజీ జామ్ కావడం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయంపై మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ కవితలు కాలనీవాసులతో చర్చించి హైవే అధికారులను పిలిపించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. సోమవారం స్థానికంగా పాదయాత్ర చేసిన శ్రీశైలంయాదవ్‌కు బోరు పనిచేయడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి మంచినీటి సమస్య నెలకొందన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఇంజినీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిశారు. వెంటనే ఆయన అధికారులతో ఫోన్‌లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదన్నారు. స్థానికంగా మౌలిక సదుపాయాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై శ్రద్ధ కనబర్చాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన 63 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు వేదికగా ఉన్న ప్రజావాణి కార్యక్రమంపై సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఎలాంటి దరఖాస్తులను ఉంచకూడదని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు.

వడ్డీలకు డబ్బులు ఇస్తామంటూ మోసం

• ముఠా సభ్యుల అరెస్టు

కుత్బుల్లాపూర్: వడ్డీలకు డబ్బులు ఇస్తామంటూ ప్రాసెసింగ్ ఫీజుల పేరిట పలువురిని మోసం చేసిన ముఠా సభ్యులను పేట్‌బషీరాబాద్ పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన కొందరు వ్యక్తులు శివారు ప్రాంతాల్లోని వీధి వ్యాపారులను టార్గెట్ చేసుకుంటూ ఐదుగురికి వడ్డీ ఇప్పిస్తే మీకు వడ్డీ లేకుండా డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. దీంతో కొంపల్లి, సుచిత్ర, జయభేరి ప్రాంతాలకు చెందిన పలువురిని వీరి వద్ద వడ్డీలకు డబ్బులు తీసుకున్నారు. ఇదే క్రమంలో పది లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. ప్రాసెసింగ్ ఫీజు కింద కొంత నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరుగురి వద్ద రూ.1.50 లక్షలు వసూలు చేశారు. డబ్బులు చెల్లించినా రుణాలు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంలో వడ్డీ వ్యాపారుల గుట్టు రట్టయ్యింది. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నిజాంపేట్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరఖండ్ ఉదంసింగ్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫారూఖ్(23) బాచుపల్లి కౌసల్య కాలనీలోని గణేష్ మండపం వద్ద వారం రోజులుగా స్టాల్‌ను ఏర్పాటు చేసి బట్టలను విక్రయిస్తున్నాడు. కాగా గత నెల 30న రాత్రి భోజనం చేసిన అనంతరం వేస్టేజ్‌ను అవతలి వైపు పారబోసే క్రమంలో ఐరన్ గేట్‌కు అతని చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడిని స్థానికంగా ఉన్న ఎస్ఎల్‌జీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు పేర్కొన్నారు. మృతుడి బంధువు జావేద్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నిజాంపేట్ బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న చెరువుల కబ్జాలపై సోమవారం జరిగిన ప్రజావాణిలో బీజేపీ నాయకులు జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ.. నిజంపేట్ ఆచార్యకుంట ఎఫ్‌టీఎల్‌లో ఫార్చ్యూన్ నిర్మాణ సంస్థ, అదే విధంగా బాచుపల్లి పెద్ద చెరువు తూము, ప్రభుత్వ స్థలాలను అక్రమించి ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన అక్రమ నిర్మాణాలపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. దీంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. బాచుపల్లి సర్వే నం.454లో పెద్ద చెరువు తూము నాలా 300 గజాల స్థలాన్ని ఆక్రమించి ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ రోడ్డుగా చూపించి హెచ్ఎండీఏ అనుమతులు పొందిందన్నారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సెక్రటరీ శేషారావు, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు కసరత్తు షురూ..



గాజులరామారం విలేజ్ చౌరస్తాలో అధికారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ

సుభాష్‌నగర్: గాజులరామారం విలేజ్ చౌరస్తాలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి సోమవార జీహెచ్ఎంసీ, విద్యుత్, ఇతర శాఖ అధికారులతో కలిసి గాజులరామారం చౌరస్తాను పరిశీలించారు. నాలుగు రోడ్లను కలిపే చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సిగ్నల్ ఏర్పాటుపై ఆయా శాఖ అధికారులతో చర్చించారు. రోడ్డు విస్తరణ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారమ్ తొలగించడంపై ఆయా శాఖ అధికారులతో మాట్లాడారు. ట్రాన్స్‌కో ఏఈ రఘుపతిరెడ్డి. టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంతోష్, ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి, ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మణిపూర్‌తో శాంతిని నెలకొల్పాలి



సూరారంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సుభాష్‌నగర్: మణిపూర్‌తో శాంతిని నెలకొల్పాలని పెంతాకోస్ట్ ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. సూరారం చౌరస్తా నుంచి జీడిమెట్ల వరకు కొనసాగిన ర్యాలీలో మణిపూర్ దోషులను శిక్షించాలి.. వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. మణిపూర్ విషయంలో కేంద్ర కలుగజేసుకుని క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరారు.

వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడిగా మల్లికార్జున్

జగద్గిరిగుట్ట: వీరశైవ లింగాయత్ సమాజం నూతన అధ్యక్షుడిగా కోనాపురం మల్లికార్జున్ ఎన్నికయ్యారు. సోమవారం జగద్గిరిగుట్ట కొండపై ఉన్న సమాజం కార్యాలయంలో సంఘం ప్రతినిధులు శివ శరనప్ప, ఆలూ ఈశ్వర ప్రసాద్, చింది బద్రినాథ్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మల్లికార్జున్ సంఘం సభ్యులతో ఎమ్మెల్యే వివేకనంద్‌ను, కార్పొరేటర్ జగన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నాడు.

కొంపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



కొంపల్లిలో రోడ్లపై పారుతున్న మురుగు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని.. ప్రధాన రోడ్లను మురుగు ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ ఆరోపించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయన ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దేవేందర్ మాట్లాడుతూ.. మురుగునీటి విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, దీంతో విద్యార్థులు, పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు కల్పించుకుని మురుగునీటి పరుగుకు అడ్డుకట్ట పడేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల్లో చలనం

సాక్షి ఎఫెక్ట్..



మాణిక్యనగర్ నాలా వద్ద ప్రారంభమైన కల్వర్ట్ తుదిదశ పనులు

రంగారెడ్డినగర్: చింతల్ మార్కెట్ రోడ్డులోని మాణిక్యనగర్ వద్ద చేపట్టిన నాలా కల్వర్ట్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుడంతో వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మూడు నెలలుగా నాలా పనులను సాగదీయడంతో ట్రాఫిక్ జామ్‌తో పాటు పాదచారులు అసంపూర్తి నాలాపై నుంచి నడకను సాగిస్తూ వస్తున్నారు. ఈ విషయమై సాక్షి ‹మూడు నెలలుగా కొనసాగుతున్న నాలా కల్వర్ట్.. వెళ్లాలంటే కష్టాలు› శీర్షిక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన సర్కిల్ అధికారులను సంబంధిత కాంట్రాక్టర్‌ను ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేయడంతో కల్వర్ట్ వద్ద పేరుకుపోయిన మట్టి కుప్పలను జేసీబీతో తొలగించి డ్రైనేజీ పైపులైన్ పనులను వేగవంతం చేశారు. అంతే అంతే కాకుండా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా కల్వర్ట్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. కల్వర్ట్‌కు రెండు వైపులా రోడ్డును అనుసంధానం చేసే తుది దశ పనులను ప్రారంభించారు.

వైద్యులు, నర్సుల ఖాళీలను భర్తీ చేయాలి

• రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి



జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్న మల్లారెడ్డి

చింతల్: జీడిమెట్ల ఈఎస్ఐ ఆస్పత్రికి కేంద్రం నిధులు మంజూరు చేసినప్పటికీ వైద్యులు, నర్సులను నియమించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించి ఆయన రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. రోజుకి 900 నుంచి 1200 మంది రోగులు వస్తారన్నారు. ప్రస్తుతానికి ఉన్న డాక్టర్లు/నర్సులు వచ్చే రోగులకు సరిపోవట్లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదని మల్లారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

◆ ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఈఎస్ఐ, ఈఎస్ఐసీలో డాక్టర్లు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఫార్మాసిస్టులు మొత్తం 231 మంది సిబ్బంది నియామకం కోసం జనవరిలోనే జీవో విడుదల అయినా ఏ ఒక్కరిని కూడా నియమించక పోవడం ప్రభుత్వానికి వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌కు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఖర్చులు భరించడానికి సిద్ధంగా ఉందన్నారు. కానీ ఖాళీలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో ఎస్ఐ డిస్పెన్సరీలలో డాక్టర్ల కొరత ఏర్పడిందన్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈఎస్ఐ డిస్పెన్సరీకు వైద్యం కోసం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే సిబ్బంది నియామకాలు చేపట్టి, జీడిమెట్ల ఈఎస్ఐ ఆస్పత్రికి పూర్తి స్థాయిలో డాక్టర్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు పత్తి సతీష్, పులి బలరామ్, బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ కేశవ్ యాదవ్, కృష్ణమూర్తి, సతీష్ రంగంపేట తదితరులు ఉన్నారు.